క్లుప్తంగా

20న పర్చూరులో జాబ్ మేళా

పర్చూరు (చినగంజాం): పర్చూరు ఎస్‌కేపీఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 20వ తేదీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీ ప్రణయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాకు హెటిరో డ్రగ్స్, అమరరాజా బ్యాటరీ, టాటా క్యాపిటల్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్ తదితర కంపెనీలు హాజరవుతాయని ఆయన తెలిపారు. వీటిలో 100 కు పైగా ఖాళీలున్నాయని, విద్యార్హతలను బట్టి జీతం రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుందన్నారు. ఈమేళాకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, బీఎస్సీ, ఎంఎస్సీ (కెమిస్ట్రీ), ఎంబీఏ, పీజీ చదువుకున్న అభ్యర్థులు వయస్సు 18–30 ఏళ్ల మధ్య కలిగి ఉన్నవారు అర్హులని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు వారి బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫోటోలు తీసుకొని నేరుగా హాజరు కావాలని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 63027 64962 నంబరును సంప్రదించాలని ఆయన సూచించారు.

చౌక ధరల దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

చీరాల టౌన్: చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని 10 మండలాల్లో రెగ్యులర్ డీలర్ షాపులు 139, కొత్త దుఖాణాలు 4 మొత్తం 143 రేషన్ దుఖాణాల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చీరాల ఆర్డీవో పి.చంద్రశేఖర్‌నాయుడు సోమవారం తెలిపారు. రాతపరీక్ష ద్వారా ఎంపిక చేస్తారని, వయస్సు 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు మించకుండా ఉండాలన్నారు. దుకాణానికి దరఖాస్తు చేసే అభ్యర్థులు సొంత గ్రామానికి చెందిన వ్యక్తి అయి ఉండాలని, అభ్యర్థి ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలన్నారు. పోలీసు కేసులు లేనివారు, చదువుతున్న వారు, విద్యా వలంటీర్లు, ఏఎన్ఎంలు, కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారు, ఆశ కార్యకర్తలు దరఖాస్తు చేయడానికి అనర్హులన్నారు. చదువు, వయస్సు, ఆధార్, నివాస ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ, 3 పాస్‌పోర్టు ఫోటోలతో ఈనెల 28లోగా చీరాల ఆర్డీవో కార్యాలయంలో తమ దరఖాస్తులు అందించాలని ఆర్డీవో తెలిపారు. వివరాలకు ఆర్డీవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అద్దంకిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

అద్దంకి రూరల్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి సోమవారం అద్దంకిలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కమిషనర్ డీ. రవీంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి ప్రజలు ఈ వేదిక ద్వారా తమ సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన ప్రకటనలో కోరారు.

అపరాల సాగుతో అధిక లాభాలు



జార్లపాలెంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి


అద్దంకి రూరల్: పొగాకు పంట సాగు తగ్గించి అపరాల సాగు చేపట్టాలని అద్దంకి మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని జార్లపాలెం గ్రామ సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొగాకుకు ప్రత్యామ్నాయ పంటగా శనగ సాగు చేస్తే రాయితీపై విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 15 లోపు పంటల బీమా చేయించుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వీర శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ముప్పవరం బాలికల వసతి గృహం ఎదుట వ్యర్థాలు, మురుగు



అద్దంకిలోని బీసీ హాస్టల్‌లో ఫ్యాన్ లేక..



నీటి సౌకర్యం లేక అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు



అద్దంకిలోని బీసీ హాస్టల్ తలుపులు లేని మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు

- విద్యార్థుల అవస్థలను పట్టించుకోని అధికారులు
- వసతి గృహాల్లో బోగస్ రోల్‌తో నిర్వహణ
- పక్కదారి పడుతున్న కాస్మోటిక్ చార్జీలు
- 'సాక్షి' విజిట్‌లో బయటపడిన సమస్యలు

హాస్టళ్లు.. సమస్యల లోగిళ్లు

వేటపాలెం/చీరాల అర్బన్:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల విద్యను ఎలా నాశనం చేసిందో మనమందరం చూస్తున్నాం. కూటమి సీఎం చంద్రబాబు నాయుడు ప్రైవేటు, కార్పొరేట్‌లకు దానం చేసి ప్రభుత్వ విద్య, వసతి గృహాలను గాలికొదిలేశారు. సరైన వసతులు లేక విద్యార్థులు చలికి, ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్నారు. చలికాలంలో సరైన దుప్పట్లు లేక, తాగడానికి సరైన తాగునీరు లేక, స్నానం చేయడానికి సరైన బాత్‌రూమ్‌లు లేక అగచాట్లు పడుతున్నారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వసతి గృహాల్లో సమస్యలు వెక్కిరిస్తున్నాయి. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.



అద్దంకిలోని వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులు



రామన్నపేట శివారులోని బీసీ బాలిక వసతి గృహంలో ఉన్న నలుగురు విద్యార్థులు

రికార్డుల్లో తప్పుల తడకలు..

వేటపాలెం మండలంలోని రామన్నపేట శివారులో వసతి గృహాన్ని అద్దె భవనంలో నడుపుతున్నారు. రికార్డులో 15 మంది విద్యార్థులు ఉంటున్నట్లుగా నమోదు చేశారు. కాని కేవలం నలుగురు మాత్రమే ఉంటున్నారు. ఈ వసతి గృహానికి నెలకు రూ.30 వేలు అద్దె చెల్లిస్తున్నారు. కేవలం నలుగురు విద్యార్థులో మూడేళ్లగా వసతి గృహం నడుపుతున్నారు. ఉన్నత అధికారులకు రికార్డుల పరంగా మాత్రం 18 మంది విద్యార్థులు ఉంటున్నట్లు రాస్తున్నారు. ప్రైవేటు గృహానికి రూ.30 వేలు అద్దె ప్రతి నెల చెల్లిస్తేన్నారు. నలుగురు సిబ్బంది, వార్డెన్‌కి ప్రతి నెల జీతాలు చెల్లిస్తున్నారు. రికార్డుల్లో నమోదైన మేరకు విద్యార్థులకు లేకపోవడంతో మిగిలి పోయిన ట్రంకు పెట్టెలు, కాస్మొటిక్స్ పక్కదారి పడుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హాస్టల్స్‌లో విద్యార్థుల రోల్ నిల్

చీరాల మండలంలో బీసీ వెల్ఫేర్‌కు సంబంధించి ఐదు హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో ప్రీ మెట్రిక్ బాలుర హాస్టల్‌లో 10 మంది మాత్రమే ఉన్నారు. అలానే రంగారెడ్డినగర్‌లోని పోస్ట్ మెట్రిక్ గరల్స్ హాస్టల్‌లో 18 మంది విద్యార్థినులు ఉన్నారు. అలానే వాడరేవు, ఉడ్‌నగర్, థామస్‌పేటలోని హాస్టల్స్‌లో విద్యార్థులు లేరు. కరోనా తర్వాత ఈ హాస్టల్స్‌లో విద్యార్థులు ఎవరూ చేరలేదు. బీసీ వెల్ఫేర్‌కు సంబంధించి ఐదు హాస్టల్స్‌లో వాడరేవులోని హాస్టల్ మాత్రమే ప్రభుత్వ భవనం ఉంది. మిగిలిన నాలుగు హాస్టల్స్ అద్దె భవనాల్లోనే ఉన్నాయి. ఈపురుపాలెం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం చుట్టూ చిల్ల చెట్లు ఎక్కువగా ఉండడంతో పరిశుభ్రత పాటించాలని ఇటీవల తనిఖీ చేసిన ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. హాస్టల్ భవనంలో వసతులు బాగానే ఉన్నా హాస్టల్ పక్కన ఖాళీ ప్రదేశం ఉండడంతో పాటు అపరిశుభ్రంగా ఉంది. రాత్రి వేళల్లో దోమల బెడద ఎక్కువగా ఉంటోంది.

సంక్షేమ హాస్టల్ పరిసరాల్లో వ్యర్థాలు..

జే.పంగులూరు/మేదరమెట్ల/అద్దంకి రూరల్: మండల పరిధిలోని ముప్పవరంలో బాలుర వసతి గృహం, బీసీ బాలికల వసతి గృహాలు ఉన్నాయి. ప్రసుత్తం బాలుర వసతి గృహంలో 15 మంది విద్యార్థులు, బాలికల వసతి గృహంలో 62 మంది ఉన్నారు. బాలికల వసతి గృహ పరిసర ప్రాంతాల్లో మురుగు ఎక్కువగా ఉంది.

- అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల పక్కన ఉన్న బీసీ బాలుర వసతి గృహంలో 30 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ వసతి గృహంలో బాత్ రూముల్లో నీటి వసతిలేక వాడుకలో లేవు. హాస్టల్‌లో ఉన్న ఆర్వోప్లాంట్ పనిచేయక చాల రోజులైంది. దీంతో విద్యార్థులకు బయటి నుంచి కొనుగోలు చేసి నీటిని తెస్తున్నారు.
- మేదరమెట్ల బీసీ హాస్టల్‌లో విద్యార్థులు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్‌కు పాఠశాలలకు కిలో మీటర్ దూరం ఉండటంతో సరైన సమయానికి విద్యార్థులు చేరుకోలేకపోతున్నారు. పమిడిపాడు వసతి గృహంలో విద్యార్థులకు తాగునీరు లేకపోవడంతో వార్డెన్ మినరల్ వాటర్ కొనుక్కొని దాహం తీరుస్తున్నారు. భోజనం మాత్రం నాసికరంగానే ఉంటోందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈరెండు వసతి గృహాల్లో సరైన మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు బహిర్భూమికి వెళ్తున్నారు.

వసతి గృహాల్లో సౌకర్యాల లేమి

మార్టూరు/చినగంజాం: పర్చూరు నియోజకవర్గ పరిధిలో మార్టూరు, చినగంజాం, పర్చూరు, యద్దనపూడి మండలాల్లో వసతి గృహాల్లో నెలకొన్న వసతులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సాక్షి విజిట్ నిర్వహించి పలు సమస్యలను గుర్తించింది. ప్రభుత్వం వసతి గృహాల నిర్వాహణకు నిధులు కేటాయిస్తున్నప్పటికీ పలు చోట్ల సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. నియోజకవర్గంలోని మార్టూరు, చినగంజాం, ఇంకొల్లు, పర్చూరు, యద్దనపూడి మండలాల్లో వసతి గృహాలున్నాయి. పలు వసతి గృహాలలో భవనాలు శిథిలావస్థకు చేరి స్లాబుకు పెచ్చులూడి ఇబ్బందులు కలుగుతుండగా, బాలికల వసతి గృహాలలోని బాలికలకు నెలలు తరబడి కాస్మోటిక్స్ చార్జీలు సకాలంతో అందక ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని వసతి గృహాలలో కనీసం తాగు నీరు అందుబాటు లో లేని పరిస్థితిలో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది.

- మార్టూరు మండలంలోని వలపర్లలోని ప్రభుత్వ బాలుర వసతిగృహం 1983లో నిర్మాణం జరిగింది. ప్రస్తుతం ఇక్కడ మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే 45 మంది విద్యార్థులు వసతి గృహంలో ఉంటున్నారు. విద్యార్థులు నిద్రించే గదులలోపై కప్పు పెచ్చులూడి కప్పు ఎప్పుడైనా కూలవచునే విధంగా ఉన్నాయి. తగినంత నీటి సరఫరా తగినంతగా లేకపోవడంతో విద్యార్థులు ఉపయోగించే మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. విద్యార్థుల తాగునీటి కోసం స్థానిక వాటర్ ప్లాంట్ నుంచి నీరు కొనుగోలు చేస్తున్నట్లు వార్డెన్ నెహేమియా తెలిపారు.
- చినగంజాం మండలంలో బీసీ బాలికల వసతి గృహం ఉంది. అందులో మొత్తం 38 మంది బాలికలు ఉన్నారు. 2024 జనవరి నుంచి నవంబరు వరకు కాస్మోటిక్స్ చార్జీలు వారి అకౌంట్‌లలో వేయలేదు.
- పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో మొత్తం 60 మంది పిల్లలున్నారు. వర్షం పడినప్పుడు పరిసరాలు వర్షపునీటితో నిండిపోయి ఇబ్బందులు కలుగుతున్నాయని విద్యార్థులు చెప్తున్నారు.

రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారిణి సుమతి

చీరాల రూరల్: రైతులు పండించిన పంటలను రైతుసేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నట్లు ఏవో సుమతి పేర్కొన్నారు. మండల పరిధిలోని దేవినూతల, కావూరివారిపాలెం, గవినివారిపాలెం గ్రామాల్లో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో సుమతి రైతులనుద్దేశించి మాట్లాడారు. 2024–25 ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన పంటను కొనుగోలు చేసేందుకు రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతు సేవా కేంద్రాల ముఖ్య ఉద్దేశం ఆయా గ్రామాల్లోని రైతుల సమక్షంలో ఆర్ఎస్‌కె ద్వారా ధాన్యం కొనుగోలు, నాణ్యత ప్రమాణాల ప్రకారం రైతులు తమ పంటలను కనీస మద్దతు ధరకన్నా తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. ధాన్యం అమ్మిన రైతుల ఖాతాలో 48 గంటల్లోనే నగదు జమచేసే విధానం అమల్లోకి తెచ్చినట్లు చెప్పారు. ధాన్యాన్ని ఎప్పుడు, ఎక్కడ అమ్ముకోవాలో రైతులే నిర్ణయించుకునేలా మొబైల్ ద్వారా కూపన్ సృష్టించుకునే సాంకేతికతను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో ఈ–క్రాప్ చేసుకుని ఈ–కేవైసీ చేయించుకున్న రైతులందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, ఆఫియా, హదస్సా, రైతులు పాల్గొన్నారు.

ప్రజల కోసం సీపీఎం పోరాటం



మాట్లాడుతున్న సీపీయం నాయకులు

అద్దంకి రూరల్: ప్రజల కోసం సీపీఎం పోరాటం సాగిస్తుందని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డీ రమాదేవి అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం 12వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజా అనుకూల విధానాల కంటే కార్పొరేట్‌లకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. జిల్లా కార్యదర్శులు గంగయ్య, మాట్లాడుతూ పెరుగుతున్న అద్దంకికి సరిపడా వసతులు కల్పించాలన్నారు. అత్యంత ప్రమాదకరంగా మారిన నామ్ రహదారికి ప్రత్యామ్నాయంగా బైపాస్ రోడ్ నిర్మించాలన్నారు. దీనిలో భాగంగా అద్దంకి పట్టణ, రూరల్ కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్‌లో సమస్యలకు పరిష్కారం

పర్చూరు (చినగంజాం): ప్రతి నెల మూడో శుక్రవారం వికలాంగుల కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించి అర్జీలు తీసుకుంటారని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పర్చూరు తహసీల్దార్ పీ బ్రహ్మయ్య, ఎంపీడీఓ వీ ప్రద్యుమ్నకుమార్, ఇంకొల్లు తహసీల్దార్ వెంకట రత్నం, ఎంపీడీఓ శ్రీనివాసరావులు తెలిపారు. అదే విధంగా నాలుగవ శుక్రవారం ట్రైబల్ వెల్ఫేర్‌కు సంబంధించిన గ్రీవెన్స్ సెల్ నిర్వహించి అర్జీలు తీసుకుంటారని వారు తెలిపారు. అదే ప్రకారం ప్రతి సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా గ్రీవెన్స్ నిర్వహించి అర్జీలు తీసుకొని పరిష్కారం చేస్తారని చెప్పారు.

పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలి..

చీరాల టౌన్: పంచాయతీల కార్యదర్శులు విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామ పంచాయితీలను అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాలను తనిఖీలు చేసి పెండింగ్ అర్జీలను విచారించినట్లు తెలిపారు. ప్రజలు వచ్చిన అర్జీలను నిశితంగా విచారించి అర్హులైన ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం అందించాలన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ రామకృష్ణ, ఏపీఎం మధు, కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చీరాల టౌన్: కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని.. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. అలానే ప్రతి నెల మూడో శుక్రవారం దివ్యాంగుల సమస్యల పరిష్కారం, ప్రతి నెల నాలుగో శుక్రవారం ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా పీజీఆర్ఎస్‌ను నిర్వహిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని ఎంపీడీవో కోరారు.

సంచార గిరిజనులకు నివేశన స్థలాలు



సంచార జాతులకు చెందిన ప్రజలతో మాట్లాడుతున్న ఆర్డీవో, అధికారులు

చీరాల టౌన్: పట్టణ ప్రాంతంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదురు రోడ్డులో నివాసం ఉంటున్న సంచార గిరిజన తెగల వారికి నివేశన స్థలాలు త్వరగా అందించేందుకు కృషి చేస్తున్నామని చీరాల ఆర్డీవో పి.చంద్రశేఖర నాయుడు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని సంఘం థియేటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు రోడ్డుపై నివాసం ఉంటున్న సంచార జాతుల ప్రజల స్థితిగతులను ఆర్డీవోతో పాటుగా సర్వే ఇన్‌స్పెక్టర్ ఎ.మునలయ్య, తహశీల్దార్ కె.గోపీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్‌లతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి రోడ్డుపై గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్న సంచార జాతులను ఆదుకుని వారికి స్థలాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారని చెప్పారు. త్వరగా స్థలాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ మున్సిపల్ అధికారులు సంచార జాతుల వారిలో రోడ్డుపై నివశిస్తున్న వారి వివరాలు, వారికి ఉన్న ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి అర్జీలు చేపట్టేలా నివేదికలు తయారు చేయాలన్నారు. ఆర్డీవో వెంకట రెవెన్యూ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

అంతర్గత రహదారుల అభివృద్ధిపై దృష్టి

కారంచేడు: గ్రామాల్లోని అంతర్గత రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీడీఓ నేతాజీ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రం కారంచేడు వెంకటలక్ష్మి నేత్రాలయం ఎదురుగా ఉన్న గ్రావెల్ రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి పరిచే కార్యక్రమానికి ఆయన శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని అనేక రహదారులు ఇప్పటికే డ్రైనేజీ సదుపాయాలతో కూడిన సీసీ రోడ్లుగా అభివృద్ధి చెంది ఉన్నాయన్నారు. అక్కడక్కడ మిగిలిన అంతర్గత రహదారులను సైతం సీసీ రోడ్లుగా మార్చే పనిలో ఉన్నామన్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారులతో పాటు, మురుగునీటి కాలువలను కూడా నిర్మాణం చేపడతామన్నారు. మండలంలోని మిగిలిన గ్రామాల్లోను ఈ పనులకు శ్రీకారం చుట్టామని, అనేక పనులకు ప్రతిపాదనలు సైతం పంపించామన్నారు. కార్యక్రమంలో పీఆర్ జేఈ సీహెచ్ రామచంద్రుడు, ఉపసర్పంచ్ రత్తయ్యచౌదరి, నాయకులు కే నరేంద్ర, పాతూరి ఆదిలక్ష్మి, పాల్గొన్నారు.

పోటీలతో విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీత



చీరాలలో చిత్రలేఖన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు



సంతమాగులూరులో కారమ్స్ ఆడుతున్న విద్యార్థులు



అద్దంకిలో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న లైబ్రేరియన్

సంతమాగులూరు (అద్దంకి): పిల్లలకు వివిధ రకాల పోటీలను నిర్వహించడంతో వారిలోని ప్రతిభ వెలికితీయవచ్చని లైబ్రేరియన్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో సోమవారం 5వ రోజు 57 గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, క్యారం, చెస్, ఖోఖో తదితర ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి న్యాయనిర్ణేతగా రిటైర్డ్ లెక్చరర్ ఎండీ అల్తాఫ్ వ్యవహరించారు. అనంతరం తన కీర్తనల ద్వారా సమాజంలోని అసమానతలు రూపుమాపేందుకు విశేష కృషి చేసినటువంటి గురుభక్త స్వర్గీయ కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అద్దంకి రూరల్: గ్రంథాలయ వార్షికోత్సవం సందర్భంగా లైబ్రేరియన్ సుగుణరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

చినగంజాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఏఎంఎల్ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. రాజుబంగారుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ పోటీలు, కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

విజేతలకు బహుమతుల పంపిణీ..

చీరాల అర్బన్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. మన చీరాల అనే అంశంపై నిర్వహించిన పోటీలలో 150 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీలను మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్ అధ్యక్షుడు వేముల చంద్రశేఖర్, నేతాజీ సేవా సమితి ప్రతినిధులు చుండూరి కృష్ణమూర్తి, సంకా చంద్రమౌళిలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పవని భానుచంద్రమూర్తి, కిషోర్, రాణెమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.



చినగంజాంలో పోటీలు నిర్వహిస్తున్న గ్రంథపాలకుడు, ఉపాధ్యాయులు

మురుగునీటి శుద్ధి కేంద్రంతో ఇబ్బందులు

చీరాల అర్బన్: మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ నిధులతో విజిలిపేట దండుబాటలో సుమారు రూ.8 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని సీపీఎం చీరాల ప్రాంతీయ కార్యదర్శి ఎన్.బాబూరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజల నివాసాలకు దగ్గరగా, మంచినీటి చెరువుకి దగ్గరలో ఈ ప్లాంట్ నిర్మాణం చేయ తలపెట్టడం దుర్మార్గమన్నారు. ఈ ప్లాంట్ దగ్గరలోనే స్కూల్ ఉందన్నారు. ఈపాటికే మురుగునీరు ఇటువైపు పారుదల లేక నీరు నిల్వ ఉందని, పశువులు ఈ మురుగునీరు తాగి మృత్యువాత పడుతున్నాయన్నారు. పంట పొలాలు కూడా ఈ కలుషిత నీరు వలన భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయన్నారు. ఈ ప్లాంట్ ద్వారా విడుదలయ్యే దుర్గంధాల వలన స్థానిక ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలయ్యే సమస్య ఉందని, ప్రజా నివాసాలకు దూరంగా ఏర్పాటు చేయాల్సిన ప్లాంట్‌ను నివాసాలకు దగ్గరలో ఏర్పాటు చేయడం దుర్మార్గమన్నారు. అధికారులు తక్షణమే స్పందించి ప్లాంట్ నిర్మాణం నిలుపుదల చేయాలన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, కార్తీక మాసం, ఆరుద్ర నక్షత్రం, చవితి తిథి సందర్భంగా మంగళ వారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.40 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.